# ది బెట్

"ఎడం చెయ్యి వాటం, డైబటీసు, తెల్లజుత్తు యివన్నీ వారసత్వం వఁయ్యా. తప్పించడం నీ మనతరం కాదు"

"నీ కింత జెలసీ కూడదు సుమా" అంటారు మా ఆయన అప్పుడప్పుడు. నన్ను దేవుడే అలా పుట్టించినప్పుడు, అది నా తప్పు కాదు. ఆడది అసూయనీ. మొగాడు మొండితనాన్ని పట్టుకొని పుడతారు. అమ్మ కడుపులోంచి. దేవుడిచ్చిన గుణం కాదనడానికి మన మెంతవాళ్ళం.

మే మా ఇంట్లో దిగిన్నాడే నూరో తప్పు చేసేసింది మా ఇంటావిడ. అసలు ఆవిడని చూడగానే ఎందుకో తెలీకుండానే ప్రిజుడిస్ అయిపోయేను. నాకు అసహ్యం అయినవి కొన్ని ఆవిడలో వుండడమే కారణం కావచ్చు. నలభై దాటినా జుట్టు నెరవని వాళ్లంటే నాకు అసహ్యం. కుక్కని కూతురిలా చూసే వాళ్ళన్నా నాకు అసహ్యమే. ఈ రెండు పాపాలూ ఆవిడ చేసింది.

ఆవిడ యిల్లు ఏ మాత్రం బాగుండక పోయినా మేము పేవ్‌మెంటు మీద కాపరం చేసేవాళ్ళం కాని ఆ యింట్లో దిగే వాళ్ళం కాము. అప్పటికే మే ఆ వూరొచ్చి ఆరు వారాలు దాటింది. ఈ ఆరువారాలూ టి.బి.లోనే మకాం. ఈ ఆరువారాలూ తిరిగిన వీధి తిరక్కుండా, అడిగిన వాళ్ళని అడక్కుండా అందర్నీ యిళ్ళు గురించి అడిగేం. ఆ వూళ్లో మహాత్ములూ, మహర్షులూ వుంటే వుండొచ్చు కాని ఇళ్లు మాత్రం లేవు. ఉన్నా బాగులేవు. బాగున్న వాటి అద్దె మా వారి జీతంలో సగంపైనే. అంత అద్దె పెట్టి దిగితే, నెల పొడుగునా ఆ యింటి యిటికలు పీక్కొని తినాల్సిందే.

"పోనీ నువ్వు పిల్లల్తో కొన్నా..." ఆయన అనబోయిన మాటలు నేను పూర్తి చేసుకోగలను.

కాని వంటరిగా వదిలి ఎన్నాళ్ళుండటం? బెంగ, భయం నా గురించి కాదు. "పొయ్యి మీదున్న కూరనీ, పొరుగూర్లో వున్న పెనిమిటినీ ఒకకంట కనిపెట్టాలన్నా, చిన్నదానివి, నీకు తెలీదు" అంటూ వుండేది మా పొరుగావిడ.

అంచేత ఆవిడ యిల్లు చూడగానే ఆవిడనీ, ఆవిడ కుక్కనీ ప్రేమించడానికే నిశ్చయించుకున్నాం. కాని నా కా నిశ్చయాన్ని ఆవిడ నిశ్చలంగా వుంచలేకపోయింది. ఆవిడ సన్నగా, నాజూక్కా మంచి గ్రేస్‌ఫుల్‌గా ఉంటుంది. ఆవిడని ముందునుండి చూస్తే తప్ప ఆవిడ వయసు తెలుసుకో లేరు. ముప్ఫై దాటిన ఆడవాళ్ళకి మంచి ఫిగర్ వుంటే నాకెందుకో పరమ చిరాకు. ఆవిడ నడక నాలుగు మల్లెల ఎత్తు. తెలుగే మాట్లాడినా ఇంగ్లీషులా మాట్లాడుతుంది. ముప్ఫై దాటిన తర్వాత ముద్దులు గుడిచే ఆడదాన్ని చూస్తే నాకు ఓర్పు పోతుంది. నాకంటే అందంగా ఉంటుందని ఒప్పుకోవడానికి నేనేం బాధపడను. నా కంటే ఐశ్వర్య వంతురాలన్నా కూడా నాకేం విచారం లేదు.

కాని వాళ్ళింట్లో దిగిన్నాడే ఆవిడ మరో తప్పు చేసేసింది. "నీ కథలు మీ ఆయన రాసి.." మా ఆయన నా కంటే యింకా చాలా మంది కంటే బాగా రాస్తారు. బొమ్మలు కూడా వేస్తారు. బొంగరాలాడతారు, మా చిన్నితో. అయితే నా కెప్పుడూ ఆయనంటే అసూయలేదు. ఆపేక్ష తప్ప. కాని ఎవరైనా అలా అంటే మాత్రం, నేను కృష్ణ దేవరాయుల్ని కాను గనుక ఉరిశిక్ష వేయలేను కాని, వాళ్ళ పళ్ళన్నీ రాలగొట్టి, లెక్కపెట్టి వాళ్ళ చేతిల్లోనే పెట్టిపంపిం చెయ్యాలనుంటుంది.

ఆవిడ మాకు ఇల్లు చూపిస్తూ.. "ఈ బాత్‌రూము మీకూ, ఆ గేరేజ్‌లో అతనికీ అంది. రెండో బాత్‌రూం ఆవిడదిట. అప్పుడా గేరేజ్ తలుపులు వేసి వుంటే అందులో కారుందనుకున్నాం. అందులో వున్నతను కారుడ్రైవరో, ఖూనీకోరో ఆవిడ చెప్పలేదు. నేను మాత్రం అతనెవరో బట్టలుకుట్టే వాడై ఉంటాడని నిశ్చయించేసుకున్నాను. బట్టలు కుట్టేవాడికి బాత్‌రూమెందుకో, ఎందుకైతే నాకేం? ఎవరైతే నాకేం? అద్దె నూటయాభై".

కాస్త ఎక్కువే. కాని వాట్‌ప్రైస్ కాపరం? ఇల్లు సదుపాయంగానే ఉంది. ఆఫీసుకీ, ఆస్పత్రికీ దగ్గరే. ఫర్వాలేదు.

ఆ మర్నాడు మే మాయింట్లో దిగుతున్నప్పుడు గేరేజ్ తలుపులు దగ్గరగా చేరవేసి వున్నాయి. లోపల నుండి తబ్లా, బుల్‌బుల్ వినిపిస్తున్నాయి. గిరజాలు, లూజు పైజమాలతో నాటకాల సరుకు కాబోలు మహాప్రభో! తొందరగా ఇల్లు మార్చేయాలి.

మర్నాడు నిద్రలేచే సరికి బాగా పొద్దెక్కిపోయింది. ఎండ వాలు తప్పింది. నిద్దర్లో తుళ్ళిపడినట్టు లేచేను.

ఎదురుగా కడిగిన ముత్యంలా నిల్చున్నాడు చిన్ని.

"ఎన్నిసార్లు చెప్పాల్రా వెధవా, నాన్నచేత నీళ్లు పోయించుకోవద్దని?" ఒక్కటి వేసేను.

"బఁయ్" మన్నాడు వెధవ. తన చిన్న కొడుకుని నేను ఖూనీ చేసేస్తున్నానేమో నన్నంత గాబరాగా పరిగెత్తుకొచ్చేరు ఆయన.

అసలు విషయం : షెడ్డులో అతను చిన్నికి నీళ్ళు పోసేట్ట. అలా చిన్నితో ప్రారంభం అయిన అతని పరిచయం రాను రాను స్నేహంగా మారింది. అతను ఎమ్మెస్సీ చదువుతున్నాట్ట హాస్టల్లో ఖాళీ లేక, వున్నా తనకి నచ్చక, యూనివర్శిటీకి దగ్గరగా వుంది కదా అని ఈ షెడ్డులో వుంటున్నాట్ట.

రాజేశ్వర్రావుకీ–షెడ్డులో స్టూడెంటు–నాకూ చాలా విషయాల్లో అభిప్రాయాలు ఒకటే. మా యూనానిమిటి ఇంటావిడ మీదా ఆవిడ కుక్కమీదా వున్న అసహ్యంతో ప్రారంభం అయింది.

"మీ అయిదుగురుకీ నాకూ కలిపి ఒక బాత్రూమా? ఇంటావిడకీ, కుక్కకీ ఒకటా? ఈ అన్యాయానికీ అంతు వుందా?" అనేవాడు.

"వాళ్ళ కుక్కకి బాత్రూ ముంటే మనకేం? బెడ్‌రూముంటే మనకేం? సర్దిచెప్పేదాన్ని. కుక్కలకి బాత్రూములు, బెడ్‌రూ ముల అనవసరం అనిపిస్తున్నా.

"పళ్ళు సలుపుతున్న పులిలా ఎలా వుంటుందో చూశారా?" అన్నాడొకనాడు.

"ఎవరు? ఆవిడా? కుక్కా?"

ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నట్టు నవ్వేడతను. అతను గమ్మత్తుగా నవ్వుతాడు. పసివాడి నవ్వులా ఉంటుంది. అతని నవ్వు. మళ్ళీ మళ్ళీ నవ్వితే బాగుండుననిపిస్తుంది.

"ఆవిడ కొడుకు అమెరికాలో వుంటున్నాట్ట" అని ఒకనాడూ.

కూతురు రష్యాలో ఉందట. అల్లుడు చైనావాడుట. అని మరొకనాడూ.

'ఎడ్వర్‌టైజ్‌మెంట్'ని (advertisement) అడ్వర్‌టిస్‌మెంట్ అనాల్ట.

"సోమర్సెట్ మామ్ పెళ్ళాన్ని వదిలేసేట్ట"

"మీకు తెలీదా? ఆవిడ సవరం శాన్ ఫ్రాన్సిస్కో నుండి తెప్పించిందిట" అన్నాడొకనాడు.

ఇలా అతను రోజుకో కొత్త భోగట్టా మోసుకొచ్చేవాడు. కొన్నాళ్ళకి అతను మా ఇంట్లో మనిషైపోయేడు.

అతన్తో అంతగా పరిచయం కాని రోజుల్లో ఓ నాడు అప్పు అడగడానికి వచ్చిన వాడిలా బిడియపడుతూ కూర్చున్నాడు.

"ఏం కావాలోయ్?"

ఏం అనుకోకపోతే కాస్త ఈ గోరింటాకు రుబ్బించి పెడతారూ. అంటూ రుమాల్లోని గోరింటాకు నేలని పోసేడు.

"ఇది ఆషాఢమాసం కాదోయ్" అన్నాను నవ్వుతూ.

"అబ్బే, కాదులెండి" అంటూ వెళ్ళిపోయాడు.

తర్వాత అలాగే నాలుగైదుసార్లు గోరింటాకు రుబ్బించి పట్టుకెళ్ళాడు. ఆ తర్వాత మూడు నాలుగుసార్లు కొబ్బరి పాలు తీయించి తీసుకెళ్ళేడు.

మరోనాడు "ఒక ఎగ్ తెప్పించరూ మీ ప్యూన్ చేత" అన్నాడు.

"నీరసంగా వుంటోందా?" అడిగేను.

"లేదులెండి" అంటూ వెళ్ళిపోయాడు.

నాలుగైదు వారాలు ఎగ్ తెప్పించి యిచ్చేను. ఎగ్ తెప్పించిన మర్నాడు మాత్రం మా బాత్‌రూం తెగకంపు కొట్టేది.

తర్వాత చాలా రోజులు గడిచిపోయేయి. ఒకనాడు మా చిన్ని వాళ్ళ షెడ్డులో వుంటే పిలుద్దామని వెళ్ళేను. వాడు స్కూల్లో లేని టైములో షెడ్డులో వుండేవాడు. నేను అలా అతని షెడ్డుకి వెళ్ళడం అదే మొదటిసారి. లోపల చాలా నీట్‌గా వుంది. ఒక మూల టేబిలు పైన పెద్ద అద్దం దానిముందు చాలా రకాల బ్రష్‌లూ, దువ్వెనలూ, రంగు రంగుల తలనూనెలూ, షాంపూలు ఉన్నాయి. ఇంకో టేబులు మీద పుస్తకాలన్నీ సర్దివున్నాయి. పక్కనే ఒక ఫోటో వుంది. అందులో వున్న ఆడ, మగా అది దంపతుల్లా వున్నారు.

"మీ పేరెంట్సా?" అన్నాను.

పట్టపగలు పిశాచం వెంబడించిన వాడిలా జడుసుకు న్నాడు అతను.

"ఎవరిదోయ్ ఆ ఫోటో?" మళ్ళా అడిగేను.

"మా అక్కా, బావా" అని కాస్త ఆగి "షి యూజ్ హోర్డ్‌లీ థర్టీ" అని కలిపేడు.

అక్క ముప్ఫై నిండకుండానే జుత్తు అంతా నెరసిపోయి ముసలి ముత్తైదువలా అయిపోవడం చాలా అన్యాయం.

"పోనీ రంగు వేసుకోవచ్చునే" అన్నాను.

"మా బావకి తనొక మహర్షినని నమ్మకం. రంగు వేసుకోవడం మహా పాపంకింద చూస్తాడు. అందుకని తను వేసుకోడు, ఆవిడని వేసుకోనివ్వడు"

అప్పుడు చెప్పేడు తన గురించిన వివరాలన్నీ, వాళ్ళు తినగా పదిమందికి పెట్టగల ఆస్థి వుందిట. తనకే బెంగలు లేవుట, కాలేజీ కమిటీ ప్రెసిడెంటు వాళ్ళనాన్నే కాబట్టి లెక్చరర్ పోస్టు తనకు రిజర్వు అయ్యేవుందిట. రిజర్వు అయివున్న మేనరికం కూడా అతని కిష్టమేనట. "మా కుటుంబానికేం లోటు లేదు. దిసీజ్ అవర్ ఓన్లీ కర్స్" అంటూ తన జుట్టు చూపించేడు. వంకిలు తిరిగి అందంగా వున్న జుత్తులో వెండితీగల్లా మెరసి పోతున్నాయి నెరసిన వెంట్రుకలు. నూనె బాగారాసి దువ్వితే అంతగా కన్పించవు. పట్టుమని పందొమ్మిదేళ్ళైనా లేని అతని బాధ, భయం నా కర్థం అయ్యేయి.

అతనికి పండు జుట్టు అంటే పరమ అసహ్యమట. వాళ్ళ కుటుంబంలో నెరసిన జుత్తు వారసత్వం. అంచేత అవారసత్వపు హక్కు నుండి బయటపడేందుకు ఎవరు ఏ వైద్యం చెప్పినా చేస్తున్నాట్ట, ఇది వరకు తను పట్టుకెళ్ళిన గోరింట ముద్దా, కొబ్బరి పాలూ, కోడిగుడ్లూ తత్సంబంధమేనట.

ఆ రోజుతో మేమిద్దరం యింకా సన్నిహితంగా అయి పోయేం. అతను నాతో ఏం చెప్పాలన్నా ఇదివరకులా బిడియ పడేవాడు కాడు. తీరిక దొరికినప్పుడల్లా జత్తు, దాని సంరక్షణ గురించే మాట్లాడేవాడు. అతని ఆత్రుతకి, భయానికి ఒక్కోసారి విసుగొచ్చేది. కాని ఎక్కువగా జాలే వేసేది.

"చూసేరు. మీకు తెలుసునో, తెలీదో, కాని మన శరీరం లోని ప్రతి అవయవానికి ఏదో ఒకరకమైన ఎక్సర్‌సైజ్ వుంటుంది. ఏ ఎక్సర్‌సైజులేని భాగం కోడిరెక్కలా క్షీణించి పోతుంది. జుత్తుకి ఏ ఎక్సర్‌సైజు వుండదు కదా. అందుకని దానికి ఏదైనా కనిపెట్టాలి. దూర దూరంగా పళ్ళున్న దువ్వెనతో రోజూ మూడు పూటలా మాడు మండేలా దువ్వాలట. నిన్నే ఎవరో అన్నారు. ఎందుకేనా మంచిది. మీరు ఒకటుంచండి" అంటూ ఒక దూరం పళ్ళ దువ్వెన నాకిచ్చి ఒకటి తను పట్టుకెళ్ళేడు. ఒక రోజు.

మర్నాడు "దువ్వాల్సింది దూరం పళ్ళదాన్తో కాదుట. దగ్గర పళ్ళదాన్తోటిట" అంటూ మరో దువ్వెన యిచ్చేడు.

ఆదివారం వస్తే పొద్దున్నే తలకి ఏదో ముద్ద పట్టించి, గంట తర్వాత తలంటుకునేవాడు.

"తలంటుకి వంటాంవదంలాంటి వస్తువులేదుటండీ"

"ఈ కొత్తరకం షాంపూ చూసేరా? ఇందులో మందారం కలిసిందట"

"జబ్‌కుసుం రాసుకుంటే జన్మజన్మలకూ జుత్తు నెరవదట"

"గోరింటాకు గోళ్ళకంటే జుత్తుకే మంచిదట"

"మాక్లాసులో ఓ అమ్మాయికి జుత్తుందండీ, పాదాల వరకూ వుంటుంది. ఏం లాభం? మొక్క జొన్న పొత్తు"

"మన ఇంటావిడ జుత్తు ఇంకా నెరవదంటారా? షష్టి పూర్తి కూడా నల్ల జుత్తుతోనే చేసుకుంటుంది కాబోలు"

ఇలా రోజూ ఏవో వార్తలు. చిట్కాలు చెప్తూనే వుండే వాడు.

ఒకనాడు "మీక్కూడా జుత్తు నెరిసే సూచనలు కనిపిస్తున్నా యండోయ్. నా మాటవిని యిప్పటి నుండి ఏదైనా ప్రారంభిం చండి. 'ప్రివెన్షన్ యీజ్‌బెటర్‌దేన్ రెమెడీ' అని మీకు తెలుసా? నా దగ్గర 'హౌ టు కీఫ్ యువర్ హైర్ ఎవర్ బ్లాక్' అన్న పుస్తకం మా వూర్లో వుండిపోయింది. ఈసారి తెచ్చిస్తానుండండి" అన్నాడు.

నాకెందుకో అతన్ని ఓడించాలనిపించింది. వెంటనే ఎడం చెయ్యి వాటం డైబటీసు, తెల్లజుత్తు – యివన్నీ వారసత్వవయ్యా, తప్పించడం మన తరం కాదు' అన్నాను. అన్నాక డిసపాయింటు అవుతాడేమోనని భయపడ్డాను. కాని కాలేదు పైగా "చూడండి తల్లకిందులా తపస్సు చేసైనా సరే నా జుత్తు నెరవనివ్వను, ఇంకా వారసత్వమంటారా? మా యింట్లో వున్నదే అది, మా నాన్నకి నల్లజుత్తు వుండడం మా అమ్మాకే తెలీదు" అన్నాడు.

"నీ తరం కాదోయ్, నీ యిష్టమొచ్చినంత పందెం"

"మీ యిష్టమొచ్చినంత పందె"

తర్వాత కొన్నాళ్ళకి చదువు పూర్తైపోయి వెళ్ళిపోయేడు అతను.

వెళ్ళిన కొత్తలో వారానికో ఉత్తరం రాసుకునే వాళ్ళం. కాని తర్వాత సంవత్సరానికొకసారి న్యూయియర్ గ్రీటింగ్స్ పంపించే స్టేజికి వచ్చేసేం.

నాలుగేళ్ళ క్రిందట తను ఐ.పి.ఎస్.కి. సెలెక్టయినట్టు మాత్రం రాసేడు.

❖ ❖ ❖

ఆవేళ బెజవాడ ప్లాట్‌ఫారం మీద ఏక్సిడెంటల్‌గా కన్పిం చేడు. టోపీతో సహా పూర్తి యూనిఫారంలో వున్నాడు. చుట్టూ ఎవరో ఆడా, మగా చాలామందున్నారు.

"హలో" పలకరించేను.

"మీరా... పదండి. యిప్పుడే వచ్చేస్తాను" అంటూ ఎవరో ఆవిడ వెనక వెళ్ళిపోయాడు.

నేను రైలు ఎక్కాను.

అతను రాలేదు.

ఇంకో నిమిషంలో రైలు బయల్దేరుతుందనగా హడావిడిగా పరుగెత్తుకొచ్చాడు.

"ఆవిడ..." అడగబోయేను.

"అబ్బే, మా బాస్ వైవ్, మా ఉద్యోగంలో మాకు బాస్ భార్య, ఖూనీకోరు వీళ్ళే ముఖ్యం. అన్నట్టు చిన్ని ఎలా వున్నాడు? ఏం చదువుతున్నాడు? మీ ఆయన ఎలా వున్నారు? "ఏవంటు న్నారు? బుజ్జి కాలేజీలో చేరిందా?" అంటూ హడావిడిగా అడిగేస్తున్నాడు.

రైలు బైల్దేరుతోంది.

చటుక్కున మా పందెం గుర్తొచ్చింది నాకు. అతని తలవేపు చూసేను. టోపీ కప్పని జుత్తు చాలా నల్లగా వుంది. రంగు వేస్తున్నాడా?

"పందెం నువ్వు గెలిచేవే? ఎంత?" అడిగేను.

అతనికి మా పందెం హఠాత్తుగా గుర్తొచ్చింది.

చిన్నప్పటి ఆట గుర్తొచ్చినట్టు నవ్వేడు, రైలు కదిలింది.

"పందెం ఎంత? పెళ్ళికి వస్తే చాలా?" అన్నాను.

"థాంక్యూ!" అంటూ తమాషాగా బౌ చేస్తూ టోపీ తీసేడు.

ఉన్న నాలుగు వెంట్రుకలూ నల్లగానే ఉన్నాయి.

**(యువ, దీపావళి 10.11.1969)**

# వాహన యోగం

**"మా** నాన్నకి జాతకాలు. జోతిష్కులు వుంటే తిండి ఉద్యోగం, పెళ్ళాం, పిల్లలు యివేవీఁ అక్కర్లేదు... ఆయన నాడీ గ్రంథం మొదలు పేవ్‌మెంట్ మీద చిలక వరకు అన్నీ నమ్ముతాడు.... జాతకాన్ని, జీవితాన్ని వెరిఫై చేస్తూ జీవిస్తారు".

"ఈ మధ్య మీరు రావడం మానేసినట్టున్నారే?" ఓ ఫ్రెండు పరామర్శ.

"ఈ మధ్యే అన్నమాటేఁవిటి. పెర్మనెంటుగా మానేస్తాను. నా ఇష్టం!" అందామనుకున్నాను.

ఔను. రాయడం లేదు. ఎందుచేత?

తీరికలేక్కాదు. రాయాలన్న కోరికలేకపోవడం అబద్ధం. మరి?

కథలకి సరైన ప్లాటు కుదరక, కుదిరినవి నాకు నచ్చక. నాకు నచ్చినవి ఇతరులకి నచ్చక.

అస్త్ర సన్యాసవఁన్నా చేస్తాను కాని దేశం సుభిక్షం అనీ, ఆకలి చావులు లేవనీ, మనుషులంతా మంచి వాళ్ళని వగైరా విషయాలు ఎంచేతో రాయలేకపోతున్నాను. అంచేత కొన్నాళ్ళు రాయడం మానేద్దామనుకున్న మాట నిజం. (నేను రాయడం మానినంత మాత్రాన భూమ్యా కాశాలు ఏకం కాలేదు. కావు) కాని తిరిగే కాలూ, రాసే చెయ్యీ వూరుకోవు.

ఈసారి కథలోకి దరిద్రం పొలిమేరలక్కూడా రాకూడదు. గొప్పవాళ్ళు నా కథల్లోకి రారు. ప్రేమ కథలు రాయడం రాదు. మరింక ఏఁవిఁటి రాసేది. నా పిండాకూడు! అంచేత ఏదైనా ప్లాటు చెప్పండీ అంటూ మావార్ని గడ్డం, కడుపు పట్టుకొని బతి మాలేను. (కాళ్లు పట్టుకోవడం నా కిష్టం వుండదు) క్వార్టరెండ్ పనితోనూ, వార్నింగైనా లేకుండా జరుగుతున్న ఆఫీసు ఇన్‌స్పెక్షనుతోనూ అసలే ఉక్కిరి బిక్కిరి అయిపోతు న్నారేమో, ఏవఁనుకున్నారో ఏమో, ఒక్కసారి నన్ను ఎగాదిగా చూసి, "కథాలేదు, కాకరకాయా లేదు... నీ బోడి కథల కోసం ఎవడూ కాసుక్కూర్చో లేదు. నోరుమూసుకో" మన్నారు.

నోరైతే మూసుకోగలిగేను, కాని చెయ్యి మూతపడలేదు. ఏం చెయ్యడానికీ తోచలేదు. అంచేత యింకెవ్వరూ దొరక్క, ఏదైనా చిన్న ప్లాటు చెప్పండ్రా అని మా పిల్లల్ని పేరు పేరునాగా బలిమాలేను. వెధవలు నవ్వి వూరుకున్నారు. కాని చెప్పలేదు. మాచిన్ని మాత్రం, "మనింట్లో అందరిమీదా, తాత గారింట్లో అంద రిమీ రాయమ్మా, బోల్డు కథలవుతాయి" అని ఓ చిన్న సలహా యిచ్చేడు.

నిజమే, పరాయివాళ్ల గురించి రాస్తే పళ్ళు రాలగొడ తారు, కాని మా వాళ్ళ గురించి రాసుకుంటే ఏం? మాటవరసకి మా వారి గురించి రాస్తే...? నయం యింకా నాలుగు కాలాల పాటు నాకు బతకాలని వుంది. మా అమ్మ ? ఆవిడ జస్ట్ ఏన్ ఆర్డినరీ వుమన్. మా పిల్లలు? ఛ.ఛ. గుంట వెధవల్ని పత్రికల కెక్కిం